క్లుప్తంగా

గుడిసెల తొలగింపునకు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని కొత్తగూడెం జంగాల కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేత నేపథ్యాన శనివారం రాత్రి ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇక్కడి ప్రభుత్వ భూముల్లో కొందరు అక్రమంగా రియల్ వ్యాపారం నిర్వహిస్తున్నారని అధికారులు గుర్తించగా, తక్కువ ధరకు స్థలాలంటూ పేదలకు అంటగట్టినట్లు సమాచారం. ఈమేరకు పలువురు గుడిసెలు వేసుకుని అనుమతి లేకుండా విద్యుత్ వినియోగిస్తున్నారు. ఖమ్మం అర్బన్ రెవెన్యూ అధికారులు విద్యుత్ ఉద్యోగుల సహకారంతో 15 గుడిసెలకు విద్యుత్ సరఫరా తొలగించారు. ఈమేరకు గుడిసెవాసులు పిల్లాపాపలతో కొత్తగూడెం–అల్లీపురం రహదారిపై బైఠాయించగా ఉద్రిక్తత ఏర్పడింది. దీంతో ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్ ఆధ్వర్యాన పోలీసులు చేరుకుని వారికి సర్దిచెప్పగా నిరసన విరమించారు.

గతుకుల రోడ్లకు మరమ్మతులు

ఖమ్మంగాంధీచౌక్: కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు నగరంలోని త్రీటౌన్ శ్రీనివాసనగర్ 17వ డివిజన్‌లో రోడ్లు దెబ్బతినగా.. స్థానిక కార్పొరేటర్ ధనాల రాధ తన సొంత ఖర్చులతో మరమ్మతులు చేయిస్తున్నారు. ఈ నేపథ్యాన సిమెంట్ కాంక్రీట్‌తో టీచర్స్ కాలనీ సెంటర్, గీతాంజలి స్కూల్ రోడ్డు, మాజీ కౌన్సిలర్ రామకృష్ణ ఇంటి ప్రాంతం, పాత వివేకవర్ధిని స్కూల్ రోడ్డులలో గుంతలు పూడ్చారు. ఈమేరకు డివిజన్‌వాసులు హర్షం వ్యక్తం చేశారు.

నివాళి..

నేలకొండపల్లి: మండలంలోని కోనాయిగూడెంలో ఇటీవల మృతి చెందిన వడ్డె భాగ్యమ్మ కుటుంబాన్ని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌లు పరామర్శించారు. శనివారం ఆమె దశదిన కార్యక్రమం నిర్వహించగా.. పాల్గొని నివాళులర్పించారు.

మామిడి మొక్కల పంపిణీ

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లి, బోదులబండ గ్రామాల్లో స్థానిక భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన మామిడి మొక్కలు పంపిణీ చేశారు. శనివారం దాత ఓరుగంటి నారాయణరావు కార్యక్రమాన్ని ప్రారంభించి 200 మొక్కల వరకు అందించారు.

జిమ్నాస్టిక్స్‌లో ప్రపంచ రికార్డు



రోహన్‌రెడ్డిని అభినందిస్తున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి: మండలంలోని జుజ్జులరావుపేటకు చెందిన రోహన్‌రెడ్డి జిమ్నాస్టిక్స్‌లో ప్రపంచ రికార్డు సాధించాడు. గ్రామానికి చెందిన రెండో తరగతి విద్యార్థి రోహన్‌రెడ్డి హైదరాబాద్‌లో జిమ్నాస్టిక్స్‌పై కోచింగ్ తీసుకుని కొన్ని నెలల వ్యవధిలోనే ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు, ఇంటర్‌నేషనల్ బుక్ ఆఫ్ రికార్డు సాధించాడు. ఈమేరకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేయగా.. హైదరాబాద్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రోహన్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కింగ్‌డమ్
వినోద	మహా అవతార్ నర్సింహ
సాయిరాం	సర్ మేడమ్
ఆదిత్య	హరి హర వీరమల్లు
శ్రీనివాస	సాయార (హిందీ), కింగ్‌డమ్

– ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	50	బచ్చలికూర	4
వంకాయ	30		20
బెండకాయ	26	పాలకూర	3
పచ్చిమిర్చి	66		20
కాకర	30	చుక్కకూర	3
బోడ కాకర	200		20
బీర	50	తోటకూర	4
దొండ	46		20
పొట్లకాయ	40	గోంగూర	4
చిక్కుడు	56		20
గోరుచిక్కుడు	50	మెంతికూర	3
క్యాబేజీ	24		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	25		25
చామగడ్డ	40	పుదీన	1
క్యారెట్	46		20
బీట్‌రూట్	26	–ఖమ్మం వ్యవసాయం	



పిల్లలను ఆడిస్తున్న పేరెంట్స్



వ్యాయామం చేస్తున్న దృశ్యం

ఆహ్లాదం.. ఆకర్షణీయం!

ప్రకృతికి నిలయంగా పీవీ పార్కు

- పార్కునిండా మొక్కలు
- ప్రత్యేక ఆకర్షణగా వాటర్ ఫౌంటెన్
- అందుబాటులో క్రీడాసామగ్రి
- యోగా శిక్షణకు పెద్దు

సండే స్పెషల్

ఖమ్మంరాపర్తినగర్: నగరంలోని బుర్హాన్‌పురం ప్రాంతంలో ఉన్న పీవీ నర్సింహారావు పార్కు ప్రకృతికి నిలయంగా మారిందనడంలో అతిశయోక్తి లేదు. 50వ డివిజన్‌లో గల ఈ పార్కు రెండు దశాబ్దాలకు పైగా ప్రత్యేక ఆకర్షణతో వర్ధిల్లుతోంది. ఇందులోని పచ్చని చెట్లు స్వాగతం పలుకుతుండగా.. ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామాలు చేసేందుకు దాదాపు 300 మందికిపైగా జనం, పిల్లలు ఆడుకునేందుకు పలు రకాల ఆటల సామగ్రి ఉండడంతో పిల్లలను తీసుకొస్తుంటారు. ఎక్కడ లేని విధంగా ఆధ్యాత్మిక బోధనలు నిత్యం జరుగుతుంటాయి. అందులోకి వెళ్లగానే సందర్శకులకు కొంత ఉపశమనం కలిగేలా పలు రకాల మొక్కలతో ఆహ్లాదకర వాతావరణం కనిపిస్తుంది. నగరంలోనే మొదటగా ఏర్పడిన పార్కుగా ఏర్పాటు కావడానికి అప్పటి సిద్దారెడ్డి డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు దీన్ని తీర్చిదిద్దడంలో తమవంతు కృషి చేశారు. నాటి నుంచి ఈపార్కును ఆదర్శవంతంగా ఉంచేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

ప్రత్యేకంగా వాటర్ ఫౌంటెన్

పార్కులో ప్రతి రోజూ సాయంత్రం వేళల్లో వాటర్ ఫౌంటెన్ ద్వారా నీళ్లు వస్తుడడంతో ఆకర్షనీయంగా సందర్శకులకు కనిపిస్తోంది. ఇక్కడకు వచ్చే వారు సెల్ఫీలు తీసుకోవడం కనిపిస్తుంటుంది. పార్కు ముగిసేంత వరకు నీళ్లు రావడంతో పిల్లల కేరింతలతో సందడి కనిపిస్తోంది. అంతేగాక కోలాటాన్ని రోజు మహిళలు ప్రాక్టీస్ చేసి కొంత సేపు అక్కడి బెంచీలపై సేదదీరుతారు. ఈపార్కుకు రావడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని సందర్శకులు పేర్కొంటున్నారు.

సందర్శకులతో సందడి..

వాకర్స్, జిమ్ చేసే వారు నిత్యం వస్తుడడంతో పార్కు కళకళ లాడుతుంటుంది. స్త్రీ, పురుషులు అనే బేధం లేకుండా వాకింగ్ చేస్తుండగా.. రాత్రి 7.30 గంటల వరకు సందడిగా ఉంటుంది. కాగా, ఇందులో మున్సిపల్ అధికారులు పది రకాల జిమ్ పరికరాలు అందుబాటులో ఉంచడంతో అత్యధికంగా మహిళలు ఆసక్తి కనబరుస్తున్నారు. అంతేగాక పిల్ల ల కోసం ఆట పరికారాలూ ఉండడంతో వృద్ధులు పిల్ల లను తీసుకొస్తున్నారు. యోగా నేర్చుకునేందుకు ఏర్పాటు చేసిన షేడ్‌లో ఉదయం, సాయంత్రం యోగా, ధ్యానం చేస్తారు.



పార్కులో మహిళల వాకింగ్

రోడ్డు విస్తరణకు రూ.2 కోట్లు మంజూరు

స్వచ్ఛందంగా నిర్మాణాలు తొలగిస్తున్న గృహవాసులు



వీ.వీ.పాలెంలో తొలగిస్తున్న గృహాల ముందుభాగం

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెంలో రోడ్డు విస్తరణకు రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరు చేయించగా, 50 అడుగుల వెడల్పుతో రోడ్డును విస్తరించనున్నారు. ఇప్పటికే ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు మధ్య నుంచి ఇరువైపులా 25 అడుగుల మేర విస్తరణకు మార్కింగ్ చేశారు. దీంతో పలువురు 14 – 15 అడుగుల మేర గృహాలను తొలగించాల్సి ఉండడంతో స్థానికులు స్వచ్ఛందంగా నిర్మాణాలను తొలగిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో వైరా రోడ్డు నుంచి వినాయక గుడి వరకు రోడ్డును విస్తరించగా, ఇప్పుడు వినాయక గుడి నుంచి సాగర్ ప్రధాన కాల్వ వరకు విస్తరణ కోసం త్వరలోనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేయనున్నారు.

నానో యూరియాపై అవగాహన



తిరుమలాయపాలెం: తెట్టెలపాడులో రైతులకు అవగాహన కల్పిస్తున్న సీతారాంరెడ్డి

ఖమ్మంరూరల్/తిరుమలాయపాలెం: నానో యూరియా వాడకంపై శనివారం వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఖమ్మంరూరల్‌మండలంలోని గుదిమళ్లలో ఏఓ ఉమానగేష్, తిరులాయపాలెం మండలం తెట్టెలపాడులో ఏఓ నారెడ్డి సీతారాంరెడ్డి క్షేత్రస్థాయిలో వివరించారు. ఈ సందర్భంగా నానో యూరియా వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. నానో యూరియా, డీఏపీ వాడకం వల్ల కలుపు రాదని, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని తెలిపారు.ఒక లీటరు నానో యూరియా ఎకరానికి సరిపోతుందని, మొక్కజొన్నకు రెండుసార్లు పిచికారీ చేస్తే సరిపోతుందన్నారు. ఒక లీటరు కొనుగోలు చేసిన రైతులకు సంకట హరణ బీమా పథకం కింద రూ.10వేలు బీమా వస్తుందని, గరిష్టంగా రూ.2 లక్షల వరకు లభిస్తుందని ఇఫ్కో కంపెనీ ప్రతినిధులు తెలిపారు. వ్యవసాయ విస్తర్ణాధికారి ఆసియా, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

7న పాలస్తీనాకు సంఘీభావంగా ప్రదర్శన



సమావేశంలో మాట్లాడుతున్న రవిమారుత్

ఖమ్మంమయూరిసెంటర్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు, పసిపిల్లల హత్యలకు వ్యతిరేకిస్తూ ఈ నెల 7న నగరంలో భారీ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు విద్యావేత్త రవిమారుత్, సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, దండి సురేష్, వి.మనోహర్‌రాజు, కాకీ భాస్కర్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని టెండర్‌రూట్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పాలస్తీనా ప్రజలపై జరుగుతున్న అన్యాయాన్ని ఖండించడం, అంతర్జాతీయ సమాజాన్ని ఈ హింసను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరడమే ఈ ప్రదర్శన ఉద్దేశమన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ కమర్తపు మురళి, సీపీఎం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, సీపీఐ నగర కార్యదర్శి జానీమియా, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల అశోక్, దేవిరెడ్డి విజయ్, జమాతే ఇస్లామిక్ జిల్లా అధ్యక్షుడు పాషాలతో పాటు కోలా లక్ష్మీనారాయణ, కిషన్ నాయక్, సీ.వై.పుల్లయ్య, మేకల సుగణారావు, చింతల రమేష్, టి.ఝాన్సీ, పి.లక్ష్మి, రామకృష్ణ, మస్తాన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయతకు అద్దంపట్టే'లా'..



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న న్యాయవాదులు

ఖమ్మంలీగల్: మచిలీపట్నం డీఎస్‌ఆర్ హిందూ లా కళాశాల (1987–90బ్యాచ్) విద్యార్థులు శనివారం నగరంలోని ఓ హోటల్‌లో 35 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఈసందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో అనంచిన్ని రామారావు, బిచ్చాల తిరుమలరావు, స్వామిజీ, మూర్తి, ముమ్మినేని శ్రీనివాసరావు, మువ్వా నాగేశ్వరరావు, దేవకి శ్రీనివాసరావు గుప్తా, కొల్లు నర్సయ్య, తాతా రవి, అడపా మురళి తదితరులు పాల్గొన్నారు.

మార్కింగ్ రోడ్ల పరిశీలన

నేలకొండపల్లి: మండలంలోని కోనాయిగూడెంలో ఎస్సీ సబ్‌ప్లాన్ రూ.21 లక్షల నిధులతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్లకు శనివారం మార్కింగ్ ఇచ్చారు. ఈ రహదారులను పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్ పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ తురక పాపయ్య మాట్లాడుతూ.. మంత్రి శ్రీనివాసరెడ్డి చొరవతో గ్రామాలకు మహర్దశ పట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బైరం దినేష్‌కుమార్, మాజీ సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ, మాజీ ఎంపీటీసీ కొమ్మినేని పుష్పావతి, పార్టీ అధ్యక్షుడు కొచ్చేర్ల శ్రీనివాసరావు, నాయకులు వెంకటేశ్వర్లు, కన్నారెడ్డి, విజయ్‌బాబు, మాధవి పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

కామేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ చింతిరాల నాగభూషణం అన్నారు. శనివారం పండితాపురంలో ఆయన మాట్లాడుతూ.. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలతో పాటు గీత కార్మికులకు పెన్షన్ రూ.4 వేలకు పెంచుతామని ఇప్పటి వరకు పెంచలేదన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీని వెంటనే నెలబెట్టుకోవలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రసాద్, రమేశ్, ఆనందరావు, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు వైద్యసేవలపై వినతి



నామాకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మంసహకారనగర్: హైదరాబాద్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో జర్నలిస్టుల హెల్త్ కార్డు చెల్లుబాటయ్యేలా చూడడంతో పాటు వీలైనంత మేర ఉచిత వైద్యం అందేలా చూడాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) నాయకులు కోరారు. ఈమేరకు మాజీ ఎంపీ, బసవతారకం కేన్సర్ హాస్పటల్ ట్రస్ట్ నామా నాగేశ్వరరావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావుతో పాటు మాటేటి వేణుగోపాల్, సామినేని మురారి పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు చూపించాలని..

ఖమ్మంమయూరిసెంటర్: రఘునాథపాలెం మండలంలోని 218 సర్వేలో గత 15ఏళ్ల క్రితం పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చి ఇప్పటివరకు స్థలాలు చూపించలేదని, వెంటనే స్థలాలు చూపించాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ అన్నారు. ఈమేరకు శనివారం పట్టాలు తీసుకుని స్థలం లేక ఇబ్బంది పడుతున్న పేదలతో కలిసి సీపీఎం నాయకులు ఆర్డీఓకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారుతున్నా అధికారులు పేదలకు అట్టి స్థలాలు చూపించడంలో వైఫల్యం చెందారని ఆరోపించారు.ఆనాడు సర్వే చేసి పట్టాలు ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే కాబట్టి ఇప్పుడైనా వారికి ఇంటి స్థలాలు చూపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్‌కె.సైదులు, ఎస్‌కె.మీరా సాహెబ్, టి.లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా | రైతు సంక్షేమ కమిషన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కనకయ్య

కామేపల్లి: రైతుల సమస్యలు పరిష్కరించి వారికి అండగా నిలిచేలా తమ ప్రభుత్వం రైతు సంక్షేమ కమిషన్‌ను ఏర్పాటు చేసిందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. లీప్స్ సంస్థ ఆధ్వర్యాన చేపడుతున్న సాగు న్యాయ యాత్రలో భాగంగా కామేపల్లిలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతుల సంక్షేమ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, న్యాయవాది, భూచట్టాల నిపుణుడు సునీల్ పాల్గొనగా ఎమ్మెల్యే మాట్లాడారు. భూభారతి చట్టం ద్వారా ఏ రైతుకు నష్టం జరగదని తెలిపారు. అనంతరం గోపాల్‌రెడ్డి, సునీల్ మాట్లాడుతూ ప్రతీ రైతుకు భూచట్టాలపై అవగాహన పెంచేలా యాత్ర నిర్వహిస్తున్నామని చెప్పారు. తొలుత లింగాల సమీపాన ఆయిల్‌పామ్ తోటలో అంతర పంటల సాగు, మిరప నర్సరీని పరిశీలించి వివరాలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు మార్కెట్, కొండాయిగూడెం పీఏసీఎస్ చైర్మన్లు బానోత్ రాంబాబు, ధనియాకుల హన్మంతరావు, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రవీందర్, ఏఓ తారాదేవితో పాటు మాలోత్ బాన్సింగ్, తోటకూరి శివయ్య, దమ్మాలపాటి సత్యనారాయణ, మద్దినేని రమేశ్‌బాబు, గుజ్జర్లపూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం నెహ్రూనగర్ ఫీడర్ (టౌన్–5) పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టౌన్–1 ఏడీఈ నాగార్జున తెలిపారు. నిజాంపేట వాసులు సహకరించాలని కోరారు. అలాగే బుర్హాన్‌పురం 33/11 కేవీ సబ్ స్టేషన్ 11 కేవీ బస్టాండ్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్–2 ఏఏఈ బి.రవికుమార్ తెలిపారు. దీంతో మామిళ్లగూడెం, భక్త రామదాసు కళాక్షేత్రం ప్రాంతం, బస్ డిపో ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

పీఎస్‌ఆర్ రోడ్డు అభివృద్ధికి నిధులు



రహదారిని పరిశీలిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని పీఎస్‌ఆర్ రోడ్డు అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. స్థానికులతో కలిసి శనివారం ఆమె రోడ్డును పరిశీలించాక కేఎంసీలో కమిషనర్ అభిషేక్ అగస్త్యతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ గాంధీచౌక్‌లోని పీఎస్‌ఆర్ రోడ్డు అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేస్తామన్నారు. ఇదే సమయాన ప్రజల ఆస్తులకు నష్టం జరగకుండా పనులు చేపడుతామని హామీ ఇచ్చారు.

కోలుకున్న డెంగీ బాధితురాలు

తిరుమలాయపాలెం: వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది అప్రమత్తతో డెంగీ బారిన పడిన మహిళ కోలుకుని ఇంటికి చేరింది. మండలంలోని చంద్రుతండాకు చెందిన బోడ అరుణకు గత నెల 27న డెంగీ జ్వరం సోకడంతో ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లింది. అప్పటికే గ్రామంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న ఉద్యోగుల ఆమెకు సుబ్లేడు పీహెచ్‌సీలో చికిత్స అనంతరం మండల ప్రత్యేకాధికారి డాక్టర్ వరికూడి సుబ్బారావు పర్యవేక్షణలో ఖమ్మం ప్రధాన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ప్లేట్‌లెట్ల సంఖ్య పడిపోగా చికిత్స చేయడంతో కోలుకుని శనివారం డిశ్చార్జి అయింది. ఈమేరకు ఇంటి వద్ద డాక్టర్ సుబ్బారావు తదితరులు ఆమెను పరీక్షించి సూచనలు చేశారు.

అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా పోరాటం

కూసుమంచి: ఇటీవల కాలంలో అమెరికా విధించిన సుంకాలకు వ్యతిరేకంగా ఈనెల 13న ఎస్‌కేఎం ఆధ్వర్యాన క్విట్ ఇండియా పిలుపు ఇస్తున్నట్లు ఏఐకేఎంఎస్ తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వి.కోటేశ్వరరావు తెలిపారు. శనివారం మండలంలోని పాలేరులో బీ.వీ.రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం పదేళ్ల పాలనలో దేశంలో వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. అనంతరం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న మాట్లాడుతూ.. రాష్ట్రంలో యూరియా కొరత వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడంలేదని విమర్శించారు. స్వామినాథన్ సిఫారసు మేరకు ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించి రుణ విమోచన చట్టం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు ఎం.భిక్షపతి, జి.ఐలయ్య, సత్యనారాయణ, నరసయ్య, బి.వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిస కావొద్దు

తిరుమలాయపాలెం: విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రమశిక్షణతో చదివి ఉన్నతులుగా ఎదగాలని ఎస్ఐ కూచిపూడి జగదీష్ అన్నారు. శనివారం మండలంలోని తిరుమలాయపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. చిన్ననాటి నుంచే లక్ష్యం నిర్దేశించుకుని సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఇంటిలిజెన్స్ ఏఎస్ఐ నర్సింహారెడ్డి, పాఠశాల హెచ్‌ఎం విజయకుమారి, ఉపాధ్యాయులు ఏవీ నాగేశ్వరరావు, పెసర ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన షాదీఖానాను పూర్తి చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో సీక్వెల్ వద్ద ప్రారంభించిన షాదీఖానాను వెంటనే పూర్తి చేయాలని ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె.సైదా అన్నారు. శనివారం నిజాంపేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక మంత్రి ముస్లిం యువతకు రాజీవ్ వికాసం పథకం 50శాతం మంజూరు చేస్తామని చెప్పి ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. నగరంలోని కబరస్తాన్‌లకు నిధులు మంజూరు చేసి నిర్మాణాలు మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ నాయకులు ఎస్‌కె.యాకూబ్, సమద్, జానీ, అజ్జు, అక్బర్, అస్లామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవకు పాటుపడేది కమ్యూనిస్టులే..

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు, ప్రజా సేవ చేసేది కమ్యూనిస్టులు మాత్రమేనని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఐలూ ఆల్ ఇండియా నాయకుడు కొల్లి సత్యనారాయణ అన్నారు. సీపీఎం టూ టౌన్ కమిటీ, బీవీకే ఆధ్వర్యాన నెలనెలా ఉచిత మెడికల్ క్యాంప్‌లో భాగంగా శనివారం మంచికంటి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఉచిత క్యాంపు నిర్వహణ మరింతగా మెరుగుపర్చడానికి వైరా రోడ్‌లో జనరిక్ మెడికల్ షాపు ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం బీపీ, షుగర్, ఫిట్స్‌కు నెలకు సరిపడా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు జీ.వై.నరేష్, పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, ప్రముఖ డాక్టర్లు నియాజ్, షమా ఫిర్‌దౌస్, రాకేష్, సి.భారవి, కొల్లి అనుదీప్, వెంకట్‌రెడ్డి, బోడేపూడి విజ్ఞాన కేంద్రం నాయకులు వై.శ్రీనివాసరావు, బోడపట్ల.సుదర్శన్, పి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్

ఖమ్మంలీగల్: నగరంలోని న్యాయసేవా సదన్‌లో అఖిల కంటి ఆస్పత్రి ఆధ్వర్యాన ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా న్యాయాధికారులకు, న్యాయశాఖ ఉద్యోగులకు కంటి పరీక్షలు నిర్వహించగా.. శిబిరాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు కె.ఉమాదేవి, వెంపటి అపర్ణ, డి.రాంప్రసాదరావు, ఎం.అర్చనాకుమారి, ఎం.కల్పన, వి.శివరంజని, టి.మురళీమోహన్, కె.దీప, వి.మాధవి, బి.నాగలక్ష్మి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి సంజయ్ శెట్కర్, డాక్టర్ కుతుంబాక అఖిల పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శాంతి కల్యాణ వేడుకలు

శ్రావణ శనివారం సందర్భంగా పలు దేవాలయాల్లో స్వామివార్లకు శాంతి కల్యాణం నిర్వహించారు. ఉదయమే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని స్వామివారిని దర్శించుకోగా.. కల్యాణోత్సవానికి ముందుగా అర్చకులు ప్రత్యేక పూజలు, హోమాలు జరిపారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు అందజేశారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంగాంధీచౌక్: శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం అలంకరణ



ఖమ్మంఅర్బన్: యూపీహెచ్‌సీ కాలనీ అభయ వేంకటేశ్వర దేవాలయంలో హాజరైన భక్తులు